హోటల్లో కూర్చున్నాక "ఎక్కడివని అడగరేం?" అంది.

అతడికి ఆ ప్రశ్న అర్థం కాలేదు.

"ఎక్కడివి?" అని అడిగాడు.

"నావి?"

అతడు మరింత ఆశ్చర్యంతో "నీకెక్కడివి?" అని అడిగాడు.

"నా సీరియల్‌కి వచ్చినవి"

ఆమె కథ పత్రికలో వచ్చిందని తెలుసు కానీ పూర్తయిందని అతడికి తెలీదు.

"ఎంత ఇచ్చారు"

"మూడు వేలు"

"మంచిమొత్తమే" అన్నాడు. "ఎన్నాళ్ళు పట్టింది వ్రాయడానికి?"

"మూడు నెలలు"

"నెలకి వెయ్యి, ఫర్వాలేదు. పదినుంచి అయిదువరకూ ప్రైవేటు ఆఫీసుల్లో పనిచేస్తే అంతే వస్తుంది" అన్నాడు.

ఆమెకోపం వచ్చింది "వ్రాయటమనేది ఆత్మసంతృప్తి కోసం" అంది.

విష్ణు వ్యాపారానికి సంబంధించిన చాలా ఇంగ్లీషు పుస్తకాలు చదువుతాడు. అలాగే కామర్స్ తాలూకు టాపిక్ వస్తే బలంగా వాదిస్తాడు. అందుకే అతడు నిజాయితీతో కూడిన విస్మయంతో నిజంగానే అర్థం కానట్టు "మరి పత్రికలకు పంపటం ఎందుకు?" అన్నాడు.

“ పదిమంది చదవటం కోసం” అంది.

“ నీ ఆత్మసంతృప్తిని అవతలివాడు క్యాష్ చేసుకుంటున్నప్పుడు అందులో వాటా అడగటంలో తప్పేముంది?”

“మీకు తెలీదు లెండి. వ్యాపారం వేరు, సాహిత్యం వేరు”.

ఆమెకి మనసులో సంతోషంగా వుంది. చాలా రోజుల తరువాత ఇద్దరూ ఇంతసేపు మాట్లాడుకోవడం.

అంతలో అతనన్నాడు. “మనిషి ప్రతి చర్యలోనూ వ్యాపారం వుంటుంది. తృప్తి అనేది వ్యాపారమే. నువ్వే చెత్త వ్రాసినా పదిమంది చదువుతారు. పదిమంది కోసం వ్రాయటం మానెయ్యి. వందమంది చదివేలా వ్రాయటానికి కష్టపడు. ఆ కష్టానికి ఫలితం చెవులు పిండి వసూలు చెయ్యి. అప్పుడు మరింత పట్టుదల పెరిగి వాళ్ళతోనే నీ నవల అడిగించుకునే స్థాయికి ఎదుగుతావు. ప్రస్తుతం నువ్వు ప్రారంభస్థాయిలో వున్నావు. ప్రచురింపబడితే చాలు అనే స్టేజినుంచి ఎందుకొచ్చిన వ్రాయటం అనే స్టేజిలోకి జారి ఆపైన వ్రాయటం మానేసి విమర్శించే వాళ్ళ లిస్టులోకి పడిపోతావు. క్రియేటివిటీ కన్నా విమర్శే నీకు తృప్తినివ్వటం ప్రారంభిస్తుంది. ఒక్కమాటలో చెప్పాలంటే కృషి తక్కువయితే చాదస్తం ఎక్కువ అవుతుంది”.

లక్ష్మి నవ్వింది.

భర్త అంత మాట్లాడటం బావుంది. ఏం మాట్లాడుతున్నాడు అన్నదానికన్నా మాట్లాడటం బావుంది.

అతడు ఆమె నవ్వుని వేరేలా అర్థం చేసుకున్నాడు.

“ ఏం? నేను మాట్లాడింది తప్పా? ఏమో. నాకు బిజినెస్ తప్ప సాహిత్యం అంతగా తెలీదు. నేను అనుకునేది ఏమిటంటే పూర్వకాలం రాజులు పోషించేవారు కాబట్టి కథలు వ్రాసేవారు. ప్రజలచేత చదివించేలా వ్రాయకపోతే ఎవరూ ప్రచురించరు. ఆ విధంగా ప్రయత్నించూ అని చెపుతున్నాను”.

ఇంతలో వెయిటర్ వచ్చాడు " ఏం ఇప్పిస్తున్నావు?"

"మీ ఇష్టం"

"ఈ రోజు నీ బడ్జెట్ ఖర్చు ఎంత?"

ఆమె నవ్వాపుకుని "మీ కెంత కావాలనుకుంటే అంత తాగండి" అంది.

అతడు వెయిటర్‌కి ఆర్డర్ ఇస్తూ, ఏదో గుర్తొచ్చినవాడిలా "నీకు" అన్నాడు.

మీ ఇష్టం అనలేదు ఎప్పటిలా (ఎప్పటిలా అంటే పెళ్ళయిన కొత్తలో హోటల్‌కొచ్చినప్పుడులా) మెనూ చూస్తూ వుండిపోయింది.

"మైల్డ్ డ్రింక్"

ఆమె ఫర్వాలేదన్నట్టు తలూపింది.

అతడి మొహంలో లీలగా ఆశ్చర్యం కదలాడింది. వెయిటర్‌వైపు తిరిగి "ఒక పెగ్ జిన్. విత్ లెమన్ కార్డియల్" అన్నాడు.

వెయిటర్ నోట్ చేసుకుని వెళ్ళిపోతూండగా "తాగి తూలను కదా" అంది అనుమానంగా.

"ఒక పెగ్‌కి ఏమీ అవదులే. అయినా ఈ రోజు ఏమిటి దీని మీదికి దారి మళ్ళింది? మొదట్లో ఎంత బ్రతిమాలినా ముట్టుకునేదానివి కాదు కదా".

" నేను కూడా అలవాటు చేసుకుందామనుకుంటున్నాను" నవ్వుతూ అంది.

తను ఇంట్రావర్షన్ నుంచి బయటపడటం ఆమెకి స్పష్టంగా తెలుస్తోంది.

వ్యాపారంలాగే డ్రింక్స్ ప్రసక్తి వచ్చినా అతడు ఉపన్యాసాలిస్తాడు "ఒకటి రెండు పెగ్‌ల వరకూ ఫర్వాలేదు. అంతకన్నా ఎక్కువయితే తట్టుకోలేవు" అన్నాడు.

"మొదట్లో మీరూ అలాగే తాగేవారు. ఇప్పుడు అయిదారువరకూ వెళ్తోంది".

"నరాలు దానికి ఎడ్జెస్ట్ అయిపోతాయి. మొదట్లో వున్నంత సున్నితత్వం వుండదు".

"కొంతకాలానికి నేనూ అలాగే అయిపోతానా?"

"వ్యసనంగా మారితే అయిపోతావు"

"మారుతుందా?"

"అది నీ కంట్రోల్ మీద ఆధారపడి వుంటుంది. అది తప్పనిసరి అనే పరిస్థితి రాకూడదు. నా ఉద్దేశ్యంలో ఆనందం కోసం తాగాలి తప్ప అవసరం కోసం కాదు".

అతడి విషయంలో అది నిజమని భార్యగా ఆమెకు తెలుసు. "కానీ ఈ మధ్య మీరు దాదాపు ప్రతిరోజు తాగుతున్నారు".

అతడు కొంచెం ఇబ్బందిపడ్డట్టు కనిపించాడు. "అవును. కొంచెం వర్రీలో వున్నాను. వ్యాపార విషయాల్లో".

"మరి ఇప్పుడు ఇది అవసరం అయింది కదా"

"కనీసం రాత్రిళ్ళు బాగా నిద్రపడుతుంది".

"నాకూ ఇది అవసరంగా మారితే?"

అతడామెవైపు ఆశ్చర్యంగా చూసి " నీకేమిటి వర్రీస్?" అన్నాడు.

ఆమె నవ్వటానికి ప్రయత్నిస్తూ "మీకేనా? మాకుండవా బాధలు" అంది.

"అదే ఏమిటీ అని అడుగుతున్నాను".

"ఈ రోజు మధ్యాహ్నం మధూహ వచ్చింది".

"ఏమిటట?"

"నాకు అబార్షన్ జరగటం అబద్ధం. అసలు గర్భమే అబద్ధమట. అంతేకాదు నేను జీవితంలో తల్లిని కాలేను ఎప్పటికీ, ఇక ఎప్పటికీ...."

లోపల్నుంచి దుఃఖం తన్నుకొచ్చింది. ఆమె పెదవులు బిగపట్టి దుఃఖం ఆపుకోవటానికి ప్రయత్నించింది.

వెయిటర్ ఈ లోపులో డ్రింక్స్ తీసుకొచ్చి బల్లమీద సర్దాడు. తన కళ్ళనీళ్ళు అతడి కంటబడకుండా వుండటం కోసం ఆమెతల బాగా వంచుకుని అతడు వెళ్ళిపోయాక కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకుంది.

విష్ణు నిశ్శబ్దంగా గ్లాసులో డ్రింక్ కలిపాడు. ఆమె ముందుకు గ్లాసు తోసి తన గ్లాసు అందుకుని "తాగు" అన్నాడు.

ఆమె అంత దుఃఖంలో కూడా ఆశ్చర్యంగా అతడి వైపు చూసింది.

అతడి మొహంలో ఏ భావమూ అంతగా గోచరించలేదు. తను గర్భవతి అని చెప్పినప్పుడు లేదు. ఇప్పుడిక జీవితంలో తల్లిని కాలేనని చెపుతున్నప్పుడూ లేదు.

అంత నిరాసక్తతని ఆమె భరించలేకపోయింది. మాతృత్వం లేదన్న దుఃఖం కన్నా భర్త నిర్లక్ష్యం మరింత దుఃఖం కలిగించింది. అప్పటివరకూ హోటల్‌లో భర్తతో సంభాషించటం వల్ల వచ్చిన ఆనందం గాలిలో ఊదినట్టు పోయింది.

ఆమె మొహంలో మారుతూన్న భావాలు అతడు గుర్తించినట్టున్నాడు "ఎందుకు? ఈ విషయానికి నువ్వంత బాధ పడతావు?" అన్నాడు.

“ఈ ప్రపంచంలో ఎవరైనా చాలా సులభంగా చేయగల ఏకైక పని అదే. పిల్లల్ని కనటం. మనకి సంతానం లేకపోతే విచారించవలసిన విషయమే కానీ, అది మరీ అంతగా కుమిలిపోవలసిన విషయం కాదు. దేశంలో చాలా మంది అనాధ పిల్లలున్నారు. ఎవరినన్నా తెచ్చి పెంచుకోవచ్చు. దీనికోసం విపరీతంగా దుఃఖించకు. ఎవరన్నా అడిగితే ఈ లోపమంతా నాది కాదు నా భర్తదని చెప్పు. ఎవరూ వచ్చి నన్ను నిలదీసి అడగరు కదా!”.

ఆమె విస్మయంగా తలెత్తి చూసింది. అతడు చాలా మామూలుగా నిర్వికారంగా వున్నాడు. అతడు అలా ఆలోచించగలడని ఆమె అనుకోలేదు. ఆమె మనసు తేలికయింది. అప్పటివరకూ మనసులో వున్న బాధనంతా చేత్తో తీసేసినట్టయింది. ఇంతకీ తన బాధ ఏమిటి? ప్రేమ పంచటానికి కొడుకో కూతురో లేకపోవటమా? లేక తను గొడ్రాలు అని ప్రపంచం అనుకుంటుందనా?

రెండోది కారణం కాకపోతే ఎవడో రోడ్డు పక్కన పేపర్లు ఏరుకునే వాడి అంశని తనలో ప్రవేశపెట్టుకుని నవమోసాలు మోసి భర్తని తండ్రిని చేయటమెందుకు? ఒక అనాధ పిల్లాడికి నిండు మనసుతో తామిద్దరూ కలిసి ప్రేమని పంచితే సరిపోతుంది కదా!

ఆ క్షణం అతడంటే ఆమెకి అప్రయత్నంగా అమితమైన గౌరవంతో కూడిన ఇష్టం కలిగింది. ఒక మనిషి వేరే కోణంలోంచి చూడగలిగితే మరోలా కనిపిస్తాడేమో.

కొన్ని క్షణాల క్రిందట అతడి నిరాసక్తత ఇప్పుడు మెచ్యూరిటీలా కనిపిస్తోంది. ప్రహసిత్ సంగతంతా చెప్పినా సర్లే అయిపోయిందేదో అయిపోయింది కదా అనేటంత మెచ్యూరిటీ.

గ్లాసు దగ్గిరికి తీసుకొంటూంటే పెదాలమీద నవ్వు కదలాడింది.

“ఎందుకు నవ్వుతున్నావు?”

ఆమె కంగారుపడుతూ “ ఏమీలేదు ఏమీ లేదు” అంది.

“లేదు చెప్పాల్సిందే”

“ ఏమీలేదు, చెప్తే బావోదు”

అతడు బలవంతం చేయలేదు. మళ్ళీ తనే ఏమనుకుందో ఏమో నెమ్మదిగా అంది “ఈ డబ్బుల్తో చీర కొనుక్కుందామనుకున్నాను”.

“కొనుక్కోవలసింది స్వార్జితం కదా”

“కానీ, అది ఇంత బాగా ఉపయోగపడుతుందనుకోలేదు”.

ఆ మాటలు అర్థం అవటానికి అతడికి అరనిముషం పట్టింది.

నవ్వాడు.

సాధారణంగా అతడు ఎప్పుడూ నవ్వడు.

నవ్వితే చాలా బావుంది.

అప్రయత్నంగా అన్‌కంట్రోలబుల్‌గా అతడి చేతిమీద చేయి వేసింది. అతడు గ్లాసు ఎత్తి “చీర్స్” అన్నాడు.

## 3

భైరవమూర్తికి యాభయి ఆరేళ్ళు. దాదాపు ముప్పై ఏళ్ళుగా పోలీసు డిపార్ట్‌మెంట్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు.

అంత వయసొచ్చినా ప్రమోషన్ రాకపోవటానికి కారణం అతడి నిజాయితీ.

ఇరవై ఏళ్ళ క్రితమెప్పుడో అప్పటి ముఖ్యమంత్రి కొడుకుతో తగాదా పెట్టుకున్నాడు. అరెస్టు వారెంటుతో వెళ్ళి భీభత్సం సృష్టించాడు. పేపర్ల కెక్కాడు. ముఖ్యమంత్రి రాజీనామా చేయవలసి వచ్చింది. చాలా లొసుగులు బయటపడ్డాయి. సంచలనం రేగింది.

అయితే రాజకీయ నాయకులు చాపక్రింద నీరులాంటి వారు. ఆరేళ్ళ తరువాత తిరిగి అధికారంలోకి వచ్చాడు మాజీ ముఖ్యమంత్రి. సమయం చూసుకుని శంకరగిరి మాన్యాలు
పట్టించాడు.

భైరవమూర్తి విసుగు చెందలేదు. అతడికి ఒక్కడే కొడుకు. లాయరు. అతడు కూడా తండ్రి లాంటి వాడే.

తృప్తికి మించింది మరేదీ లేదని నమ్ముతారు ఆ కుటుంబమంతా.

ప్రమోషన్ రానందుకూ అంత వయసొచ్చి రిటైర్ అవబోతున్న ఇన్‌స్పెక్టర్‌గానే పని చేయవలసి వచ్చినందుకూ భైరవమూర్తి ఎప్పుడూ బాధపడలేదు.

అతడో విశిష్టమైన వ్యక్తి. నేరస్తులకి అతడంటే సింహస్వప్నం. ప్రతిదీ చట్ట ప్రకారమే చేయడం ఎలాగో ఒకలా నేర్పి వప్పిస్తాడు.

మరో రెండు నెలల్లో ప్రమోషన్ వస్తోందని అతడికి తెలిసింది. సంతోషించాడు. తనకి ప్రమోషన్ వస్తున్నందుకు కాదు, ఆలస్యంగానైనా నిజాయితీ గెల్చినందుకు.

ముఖ్యమంత్రి కొన్ని కోట్లు సంపాదించి వుండవచ్చు కానీ తనకున్న తృప్తి అతడికుండదు అన్నది తప్పు స్టేట్‌మెంట్.

డబ్బు సంపాదించలేని ప్రతివాడూ అలాగే అనుకుంటాడు. అవినీతి పద్ధతిలో లక్షలు సంపాదించినవాడు కూడా తన పద్ధతిలో తాను జీవితాన్ని తృప్తిగా ఆనందిస్తూ వుండి వుండవచ్చు. వాడు ఎంత తృప్తితో బ్రతుకుతున్నాడన్నది కాదు చూసుకోవాల్సింది మనమెంత తృప్తిగా బ్రతుకుతున్నామన్నది.

ఆ విషయంలో భైరవమూర్తికి ఏలోటూ లేదు. ఒక్కడే కొడుకు. చక్కగా అల్లుకున్న కుటుంబం అది. కొడుకు కూడా చేతికి అంది వచ్చాడు. లాయరుగా మంచి ప్రాక్టీసు వుంది. తొందర్లో పెళ్ళి కూడా చేయబోతున్నారు.

అప్పుడు జరిగింది అనుకోని ఒక సంఘటన. మొత్తం పొదరిల్లు కుప్పకూలిపోయే సంఘటన.

మొట్టమొదటిసారి భైరవమూర్తికి దేవుడి మీద నమ్మకం పోయింది.

ఎందుకు? ఎందుకిలా చేశావ్? అని దేవుణ్ణి అడిగాడు. దాదాపు పిచ్చెక్కిపోయాడు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో పని చేయటం వృథా అనుకున్నాడు.

ఆ సమయంలో అతడికి ప్రమోషన్ వచ్చింది.

ట్రాన్స్‌ఫర్ అయింది.

డాక్టర్ విశాల్ క్లినిక్ వుండే ఏరియాకి.

## 4

మధూహ చెంప ఛెళ్ళుమంది.

"లక్ష్మి దగ్గరకెళ్ళి ఆ గర్భం నకిలీదని ఎందుకు చెప్పావ్?" అంటూ ఆవేశంతో వూగిపోతూ మళ్ళీ చెయ్యి ఎత్తాడు రాజు.

బలంగా తగిలిన ఆ దెబ్బకి మధూహకి కోపం రాలేదు. దుఃఖం రాలేదు. ఆశ్చర్యం వేసింది.

రాజుకి అంత ధైర్యం ఎలా వచ్చిందా అని? డబ్బు సంపాదించాలి అన్న తపన, కాస్త ఇన్ఫీరియారిటీ కాంప్లెక్స్, కాస్త పిరికితనం మూర్తీభవించిన మనిషి రాజు.

ఇప్పుడతనికి అంత ధైర్యం ఎలా వచ్చిందో అతని నోటి వెంట వస్తున్న వాసన చెపుతోంది.

అతడి కళ్ళు ఎర్రగా వున్నాయి. మనిషి నిలువెల్లా వణికిపోతున్నాడు.